సాక్షి
విశాఖపట్నం
బుధవారం, 9 ఏప్రిల్, 2025

సంప్రదాయ షోయగం

చీర, పంచెకట్టులో మెరిసిన ఏయూ విద్యార్థులు







విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీలోని వివిధ విభాగాల్లో కొన్ని రోజులుగా జరుగుతున్న ఎథ్నిక్ డే వేడుకలు అంబరాన్ని తాకుతున్నాయి. ఇందులో భాగంగా ఇంజినీరింగ్ కాలేజీ సివిల్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం అత్యంత కోలాహలంగా ఈ కార్యక్రమం జరిగింది. తెలుగు సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టేలా విద్యార్థినులు చీరలు ధరించి ర్యాంప్ వాక్‌తో అదరగొట్టారు. విద్యార్థులు పంచెలు కట్టుకుని తమ సంస్కృతిని చాటుకున్నారు. ఇక్కడ విద్యనభ్యసిస్తున్న విదేశీ విద్యార్థులు సైతం తమదైన వస్త్రధారణతో ర్యాంప్‌పై నడిచి అందరినీ ఆకట్టుకున్నారు. విభాగం హెచ్‌వోడీ పీవీవీ సత్యనారాయణ, ఫ్యాకల్టీ హెడ్ ఆచార్య రాజశేఖర్, స్టూడెంట్ కో–ఆర్డినేటర్స్ పవన్ కుమార్ నాయక్, రాహుల్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన సుమారు 350 మంది విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొని ఉత్సాహంగా గడిపారు.



పంచెకట్టులో విద్యార్థులు



విదేశీ విద్యార్థులు



చీర కట్టులో విద్యార్థినుల సందడి





మాంగల్యం చూపిస్తున్న అర్చకులు

సింహగిరి మాడ వీధిలో రథోత్సవం



నేత్రపర్వంగా అప్పన్న కల్యాణోత్సవం

- నందడిగా ఎదురు సన్నాహోత్సవం
- హరినామస్మరణతో మార్మోగిన సింహగిరి
- ఉత్సాహంగా రథోత్సవం.. పరవశించిన భక్తజనం
- భక్తులకు ముత్యాల తలంబ్రాల పంపిణీ

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవం మంగళవారం రాత్రి కనులపండువగా జరిగింది. భూదేవి, శ్రీదేవి సమేత అప్పన్న స్వామి కల్యాణాన్ని తిలకించేందుకు తరలి వచ్చిన భక్తుల హరి నామస్మరణలతో సింహగిరి మార్మోగింది. పాంచరాత్ర ఆగమ శాస్త్రాన్ని అనుసరించి కల్యాణోత్సవ ఘట్టాలను ఆలయ అర్చకులు మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభించారు. తొలుత ఆలయ నీలాద్రిగుమ్మం వద్ద అర్చకులు, ముత్తయిదువులు పసుపుకొమ్ములను దంచి కొట్నాల ఉత్సవాన్ని నిర్వహించారు. తదుపరి ముక్కోటి దేవతలకు కల్యాణోత్సవ ఆహ్వానాన్ని పలుకుతూ అలయ ధ్వజస్తంభం వద్ద అర్చకులు గరుడాళ్వార్ చిత్రపటాన్ని ఎగురవేసి ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వాద సంవాదాలతో ఎదురు సన్నాహం

ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని బంగారురంగు పల్లకీలో, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ముత్యాల పల్లకీలో వేంజేపచేశారు. అమ్మవార్ల పల్లకీని, అయ్యవారి పల్లకీని సింహగిరి మాడవీధిలో చెరొక వైపు తీసుకెళ్లి పశ్చిమ మాడ వీధిలో జోడుభద్రాల వద్ద ఎదురెదురుగా ఏర్పాటు చేసిన వేదికపై ఉంచారు. అక్కడ ఎదురు సన్నాహోత్సవం వాద, సంవాదాలతో ఆహ్లాదకరమైన వాతావరణంలో భక్తుల ఆనందోత్సాహాల మధ్య వేడుకగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పూల దండలతో నృత్యాలు చేస్తూ ఎదురు సన్నాహోత్సవాన్ని రక్తి కట్టించారు. వ్యాఖ్యాతలుగా తిరుమల తిరుపతి దేవస్థానం పరిచారకుడు కె.ఇ.లక్ష్మీనరసింహన్, నరసాపురానికి చెందిన ఆధ్యాత్మికవేత్త వంగల వెంకటాచార్యస్వామి వ్యవహరించారు.



ఎదురు సన్నాహోత్సవానికి స్వామిని ఊరేగింపుగా తీసుకొస్తున్న దృశ్యం





హాజరైన భక్త జనం

పెద్ద ఎత్తున రథోత్సవం

సింహగిరి మాడ వీధిలో పెద్ద ఎత్తున రథోత్సవం నిర్వహించారు. స్వామి ఉత్సవమూర్తులను రథంలో వేంజేపచేశారు. జాలరి పెద్ద కదిరి లక్ష్మణరావు రథసారధిగా నిలిచి రథ కదలికలను సూచిస్తుండగా, లక్ష్మీదేవి అమ్మవారి బంధువులుగా విశాఖ నగరం నలుమూలల నుంచి వచ్చిన జాలర్లు రథం నడిపే బాధ్యతలు చేపట్టారు. అశేష భక్తజనం స్వామి రథాన్ని తాళ్లతో లాగి పరవశించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

రథోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తాడేపల్లిగూడెంకి చెందిన రాజరాజేశ్వరి కాళీమాత ట్రూప్ బృందంచే కాంతారా డ్యాన్స్, గోపాలపట్నంకి చెందిన శ్రీమన్నారాయణ కోలాటం బృందం ప్రదర్శన, ఎస్.కోటకి చెందిన పార్వతీపరమేశ్వర ట్రూప్‌చే చెక్కభజన తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కమనీయంగా కల్యాణం

సింహగిరిపై ఉత్తరరాజగోపురం ఎదురుగా ఉన్న ప్రాంగణంలో రాత్రి 10.30 గంటల నుంచి వార్షిక కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామిని, అమ్మవార్లను కల్యాణ ప్రాంగణంలోకి తీసుకొచ్చి భారీ ఎత్తున ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేణ పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తదుపరి భక్తులకు ముత్యాల తలంబ్రాలు, ప్రసాదం అందజేశారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, వేదపండితులు కార్యక్రమాన్ని నిర్వహించారు. రథోత్సవం, కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని సింహాచలం దేవస్థానం ఈవో కె.సుబ్బారావు ఆధ్వర్యంలో విశేషంగా ఏర్పాట్లు చేశారు. గోపాలపట్నం లా అండ్ ఆర్డర్ సీఐ గొలగాని అప్పారావు బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



కేరళ డప్పు వాయిద్యాలు



కోలాటం ఆడుతున్న మహిళలు

పచ్చ డ్యూటీ!

టీడీపీ నేతల అడుగులకు మడుగులొత్తుతున్న పోలీసులు

సీపీ చెబితేనే కేసులు.. లేకుంటే రాజీలు.. వినకపోతే బెదిరింపులు

పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎవరిని చెప్పుతో కొట్టినా కేసు పెట్టరు.. ఆస్పత్రిలో బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడినా పట్టించుకోరు.. ఓ హోటల్‌లో ఎన్ఆర్ఐ మహిళ విగత జీవిగా పడి ఉన్నా.. అబ్బే అలాంటిదేమీ లేదని బుకాయించేస్తారు.. కూటమి పార్టీతో చేతుల కలపలేదని ప్రత్యర్థి పార్టీ కార్పొరేటర్ ఇంటికి వెళ్లి మహిళలు, పిల్లలపై బెదిరింపులకు దిగుతారు.

ఇదీ విశాఖ పోలీసుల పనితీరు.



- పోలీసుల ఎదుటే దాడులకు తెగబడుతున్న టీడీపీ నేతలు
- గాజువాక పోలీస్‌స్టేషన్‌లోనే ఒక వ్యక్తిని చెప్పుతో కొట్టిన తెలుగు మహిళా అధ్యక్షురాలు
- అయినా కేసు పెట్టకుండా తటపటాయించిన అధికారులు
- వీడియో వైరల్ అవడంతో సీపీ ఆదేశాలతో చివరికి కేసు నమోదు
- అన్ని పోలీస్ స్టేషన్లలో ఇదే తంతు

విశాఖ సిటీ: నగరంలో కొందరు సీఐలు, ఏసీపీలు పచ్చ రంగు పులుముకుని విధులు నిర్వర్తిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అధికార మదంతో కూటమి నేతలు పోలీసుల కళ్ల ముందే ఎన్ని అకృత్యాలు చేసినా వీరికి కనిపించవు. వినిపించవు. బాధితులు స్టేషన్ల చుట్టూ ఎన్నిసార్లు ప్రదక్షిణలు చేసినా.. సీఐ, ఏసీపీలను కలిసినా ఎటువంటి ప్రయోజనం ఉండదు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి దృష్టికి వెళ్లలేనంత వరకు ఎటువంటి కేసులు నమోదు కావు. అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తుతూ వారి సేవలో తరిస్తున్నారనడానికి ఇటీవల జరుగుతున్న వరుస ఘటనలే ఇందుకు నిదర్శనం.

స్టేషన్‌లోనే చెప్పుతో కొట్టిన తెలుగు మహిళ

గాజువాక పోలీస్ స్టేషన్‌లో తెలుగుదేశం పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలి వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపింది. స్టేషన్‌లో నరేంద్ర అనే వ్యక్తి ఎస్ఐ ముందు మాట్లాడుతున్న సమయంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి లోపలకు వచ్చారు. వచ్చీ రావడంతోనే కాలి చెప్పు తీసి నరేంద్ర ముఖంపై కొట్టారు. దీంతో నరేంద్రతో పాటు ఎస్ఐ కూడా నిర్ఘాంతపోయారు. ఆ తరువాత కూడా అతడి మీదకు వెళుతున్నా ఆమెను ఆపే సాహసం చేయలేకపోయారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి ప్రయోజనం లేకపోయింది. అయితే స్టేషన్‌లోని సీసీ కెమెరాలో రికార్డయిన ఆమె దాడి చేసిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయినప్పటికీ కేసు పెట్టకుండా ఈ వ్యవహారంలో రాజీ కుదర్చాలని చివరి వరకు పోలీసులు ఆపసోపాలు పడ్డారు. ఈ విషయం సీపీ శంఖబ్రత బాగ్చి దృష్టికి వెళ్లడంతో ఆయన ఆదేశాలతో తప్పనిసరి పరిస్థితుల్లో తెలుగు మహిళా అధ్యక్షురాలిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇదిలా ఉంటే.. ఆ కేసు పెట్టే సమయంలో కూడా సదరు మహిళా నేత గాజువాక సీఐ పార్థసారధిపై చిందులు తొక్కారు. స్టేషన్ నుంచి బదిలీ చేయిస్తానని శపథం చేశారు. అయినప్పటికీ పోలీసులు మారు మాటలేకుండా ఆమెకు స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించారు.

పచ్చరంగు పులుముకుని..

విశాఖ పోలీసులు ప్రతిపక్ష పార్టీ నేతలు, అభిమానులపై ప్రవర్తిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. కూటమి నేతలకు పూర్తిగా సాగిలా పడుతున్నారన్న వార్తలు గుప్పుమంటున్నాయి. మేయర్ పీఠాన్ని దక్కించుకోవడానికి కూటమి నేతలు చేస్తున్న కుటిల ప్రయత్నాలకు పోలీసులు శాయశక్తుల సహకారం అందిస్తున్నట్లు



తెలుస్తోంది. ఇందుకోసం కొందరు సీఐలు మితిమీరి ప్రవర్తిస్తున్న విషయం ఇటీవల దుమారం రేపింది. మేయర్ సీటుకు అవసరమయ్యే బలం లేకపోవడంతో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లకు వల వేసి తాయిలాల ఎరచూపి కొంత మందిని లాక్కుంది. అయినప్పటికీ పూర్తిస్థాయి బలం లేకపోవడంతో మిగిలిన వారిని తమ వైపునకు తిప్పుకోవడానికి ఖాకీ అస్త్రాన్ని ప్రయోగించింది. కూటమి నేతల ఆదేశాల మేరకు ఒక సీఐ పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న వైఎస్సార్ సీపీకి చెందిన కార్పొరేటర్ ఇంటికి వెళ్లి అత్యుత్సాహాన్ని ప్రదర్శించారు. కార్పొరేటర్ ఎక్కడ ఉన్నాడో చెప్పకపోతే.. ఇంట్లో ఉన్న మహిళలను, పిల్లలను స్టేషన్‌కు తీసుకువెళ్లాల్సి వస్తుందని బెదిరింపులకు దిగారు. ఈ ఘటనపై వైఎస్సార్‌సీపీ నేతలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేయడంతో పోలీసులు వెనక్కి తగ్గారు.

వైఎస్సార్ సీపీ ఫిర్యాదు చేస్తే నో కేస్

ఆరేడేళ్ల క్రితం వైఎస్సార్ సీపీ నాయకులు, సానుభూతిపరులు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారన్న కారణంతో అరెస్టులు చేస్తున్న పోలీసులు.. ఇప్పుడు కూటమి నేతల దాష్టీకాలను మాత్రం చూసీచూడనట్లు వదిలేస్తుండడం గమనార్హం. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్.. టీడీపీ నేతల అసభ్య పోస్టులపై ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్నప్పటికీ.. ఇప్పటివరకు కనీసం కేసు కూడా నమోదు చేయకపోవడం వీరి పనితనానికి నిదర్శనం. అదే టీడీపీ నుంచి ఒక వార్డు స్థాయి నాయకుడు గానీ, అభిమాని గానీ ఫిర్యాదు చేస్తే మాత్రం క్షణాల్లోనే అరెస్టులు, రిమాండ్‌లు జరిగిపోతున్నాయి.

కేసులు మాయం..!


విశాఖలో వరుస హత్యలు, మహిళలపై అఘాయిత్యాలు గుబులు పుట్టిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన పది నెలల్లోనే నగరంలో క్రైమ్ రేట్ గణనీయంగా పెరిగిపోయింది. వరుస ఘటనలు కూటమి ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. నేర నియంత్రణకు చర్యలు చేపట్టలేని ప్రభుత్వం.. కేసులను గోప్యంగా ఉంచాలని మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఫలితంగానే విశాఖలో జరుగుతున్న హత్యలు, మహిళలపై అఘాయిత్యాలను పోలీసులు గోప్యంగా ఉంచడానికి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఏఎస్‌హెచ్‌లో బాలికపై వార్డు బాయ్ అఘాయిత్య ప్రయత్నం చేశాడు. ఈ విషయం బయటకు రాకుండా ఉంచేందుకు పోలీసులు అష్టకష్టాలు పడ్డారు. అలాగే ఓ హోటల్‌లో ఎన్ఆర్ఐ మహిళ మృతి కేసును మాయం చేయడానికి చివరి వరకు ప్రయత్నించారు. మూడు రోజుల తరువాత ఈ విషయం బయటకు పొక్కడంతో అది ఆత్మహత్యగా కేసు నమోదు చేశారు. ఇలా నగరంలో హత్యల నుంచి చోరీల వరకు అన్ని కేసులను గోప్యంగా ఉంచడానికి అపసోపాలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా ఉండేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారు.



తారాస్థాయికి కూటమి కుట్రలు

- 26న డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాస సమావేశం
- 58 మంది కార్పొరేటర్లు ప్రతిపాదించారని నోట్

డాబాగార్డెన్స్: గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లో కూటమి నేతల కుటిల రాజకీయాలు తారాస్థాయికి చేరుకున్నాయి. ఎలాగైనా మేయర్ పీఠాన్ని చేజిక్కించుకోవడానికి తమ స్వార్థపూరిత అజెండాను అమలు చేయడానికి ఎప్పటికప్పుడు కుట్రలు పన్నుతున్నారు. జీవీఎంసీలో మెజార్టీ లేకపోయినా ఫిరాయింపులను ప్రోత్సహించడం ద్వారా మేయర్‌ను తొలగించాలని ప్రయత్నిస్తున్నారు. సాంకేతికంగా ఇది సాధ్యం కాకపోయినా.. తెర వెనుక నుంచి కథ నడిపించేందుకు జిల్లా ఉన్నతాధికారులు సహకరిస్తున్నారు. ఇందుకు నిదర్శనమే ఏకంగా 58 మంది కార్పొరేటర్లు మేయర్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించారంటూ జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ నోటీసులు జారీ చేయడం. అసలు సమావేశమే జరగకుండా అవిశ్వాస తీర్మానం నోటీసు జారీ చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నెల 19న జరగాల్సిన సమావేశం అజెండాలో మాత్రమే ఈ అంశాన్ని చేర్చాల్సి ఉండగా, ఉన్నతాధికారులు మాత్రం కూటమి ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గి అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. ఇదిలా ఉండగా, తాజాగా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పై కూడా ఇదే తరహా కుట్రకు తెరలేపారు. నాలుగైదు రోజుల కిందట మేయర్‌పై అవిశ్వాస తీర్మానం నోటీసులు జారీ చేసిన జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్.. ఇప్పుడు డిప్యూటీ మేయర్‌పై కూడా 58 మంది కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించారంటూ నోటీసులు జారీ చేయడం కూటమి ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలకు అద్దం పడుతోంది. అంతేకాదు ఈ తీర్మానాన్ని 58 మంది కార్పొరేటర్లు ప్రతిపాదించినట్లు కలెక్టర్ తన నోట్‌లో పేర్కొనడం చూస్తుంటే.. అంతా ముందే నిర్ణయించుకున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. డిప్యూటీ మేయర్‌కు సంబంధించి ఈ నెల 26న జీవీఎంసీ కౌన్సిల్ హాల్లో అవిశ్వాసానికి సంబంధించిన సమావేశం నిర్వహించనున్నట్లు నోటీసులో పేర్కొనడం ఈ కుట్రను మరింత బలపరుస్తోంది.



టెలిస్కోప్‌లో చంద్రుడిని చూస్తూ...

• మామ.. చందమామ..

ఏయూక్యాంపస్: నగరవాసులకు చంద్రుడిని చాలా దగ్గరగా చూసే అవకాశం లభిస్తోంది. హైదరాబాద్‌కు చెందిన స్టార్ డస్ట్ ఆస్ట్రానమీ క్లబ్ 'ద మూన్ షో' పేరుతో ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అంతరిక్షంపై ఆసక్తి ఉన్నవారికి సరికొత్త అనుభూతిని అందించడమే లక్ష్యంగా ఈ క్లబ్ పనిచేస్తోంది. ఇందులో భాగంగా బీచ్‌రోడ్డులోని యోగా విలేజ్ ఎదురుగా అత్యాధునికమైన మక్సుటోవ్ కాస్సెగ్రెయిన్ టెలిస్కోప్‌ను ఏర్పాటు చేసింది. దీని ద్వారా చంద్రుడి ఉపరితలంపై ఉన్న పర్వతాలు, లోయలు వంటి వాటిని స్పష్టంగా చూడవచ్చు. ఈ నెల 15 వరకు ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి ఈ అవకాశం కల్పిస్తున్నట్లు స్టార్ డస్ట్ సంస్థ తెలిపింది.

• అమ్మతో అపురూప క్షణం



సాగర తీరంలో సాయంత్రం వేళ.. తల్లిదండ్రులు తమ పిల్లల ముద్దులొలికే నవ్వులు, కేరింతలు, వారి అమాయకత్వాన్ని సెల్‌ఫోన్లు, కెమెరాల్లో బంధిస్తూ ఆనందిస్తున్నారు. అలా ఓ తల్లి తన బిడ్డతో కలిసి ఉన్న అపురూపమైన దృశ్యాన్ని 'సాక్షి' కెమెరా బంధించింది. పిల్లల మురిపాలు తల్లిదండ్రులకు జీవితాంతం గుర్తుండిపోయే ఉత్సాహాన్నిస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ముంచెత్తిన వాన



విశాఖ సిటీ: బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా విశాఖలో మంగళవారం రాత్రి కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ వేడి ఉక్కిరిబిక్కిరి చేసింది. సాయంత్రం 7 తరువాత వాతావరణం చల్లబడింది. మేఘాలు దట్టంగా కమ్ముకున్నాయి. 9 గంటల నుంచి జిల్లా అంతటా ఈదురుగాలులు, ఉరుములతో కూడిన భారీ వర్షం పడింది. దీంతో నగరంలో చాలా ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్ల మీద వర్షపు నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉన్న ఈ అల్పపీడనం 24 గంటల్లో క్రమంగా బలహీనపడే అవకాశముంది. దీని ప్రభావంతో మరో రెండు రోజుల పాటు తేలిక పాటి నుంచి ఉరుములతో కూడిన వర్షాలు పడే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.



16న జెడ్పీ సర్వసభ్య సమావేశం

మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 16న చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ సమావేశ మందిరంలో ఆ రోజు ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, అన్ని విభాగాల అధికారులు పూర్తి నివేదికలతో సిద్ధం కావాలని ఆదేశించారు.

రాగులు కొనుగోలు ప్రారంభం

మహారాణిపేట: జిల్లాలో 2024–25 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కు గానూ మంగళవారం నుంచి రైతు సేవా కేంద్రాల ద్వారా రాగులు కొనుగోలు ప్రారంభించినట్లు జేసీ పి.మయూర్ అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. రాగులు మద్దతు ధర క్వింటాల్‌కు రూ.4,290 అని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జేసీ కోరారు.

ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షునిగా నరేష్



విశాఖ లీగల్: ఇండియన్ లాయర్స్ అసోసియేషన్(ఐఎల్ఏ) విశాఖ జిల్లా అధ్యక్షుడిగా యడ్ల నరేష్(వై.వి.ఎల్.ఎన్.రావు) నియమితులయ్యారు. విజయవాడలో జరిగిన సమావేశంలో ఐఏఎల్ రాష్ట్ర అధ్యక్షుడు జి.శాంతకుమార్ నియామక పత్రాన్ని నరేష్‌కు అందజేశారు. ఐఏఎల్‌కు దేశ వ్యాప్తంగా గుర్తింపు తీసుకురావడానికి, మహిళా న్యాయవాదులకు సంస్థలో తగిన ప్రాధాన్యత కల్పించడానికి కృషి చేస్తానని నరేష్ తెలిపారు. న్యాయవాదులకు ఇస్తున్న డెత్ బెనిఫిట్స్‌ను కనీసం రూ.10 లక్షలకు పెంచే విధంగా పోరాటం చేస్తానన్నారు.

అంధ బాలికల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కొమ్మాది: సాగర్‌నగర్‌లోని ప్రభుత్వ అంధబాలికల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి గానూ ప్రవేశాలు ప్రారంభమైనట్లు ప్రధానోపాధ్యాయురాలు షేక్ నూర్జహాన్ ఓ ప్రకటనలో తెలిపారు. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇక్కడ తరగతులు నిర్వహిస్తున్నామని, మొత్తం 100 మందికి గానూ ప్రస్తుతం 53 మంది ఉన్నారని పేర్కొన్నారు. 47 మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె చెప్పారు. 6 నుంచి 14 ఏళ్ల వయసు ఉండి, కనీసం 40 శాతం అంధత్వం గల బాలికలకు ప్రవేశం కల్పిస్తామన్నారు. ప్రవేశ సమయంలో నిర్దేశించిన వైద్య ధ్రువీకరణపత్రం సమర్పించాలని స్పష్టం చేశారు.

కోడిగుడ్ల ధరలు


	రూ.లలో (వందకు)
విశాఖ	435.00
విజయనగరం	435.00
శ్రీకాకుళం	439.00

ఇంటెలిజెచర్స్‌తో నియంత్రణ సోల్‌సెన్స్‌తో బాడీ ట్రాకింగ్


- ఏయూసీఈడబ్ల్యూ విద్యార్థినుల కొత్త ఆవిష్కరణలు
- మరిన్ని ప్రయోగాలవైపు అడుగులు
- ఆంధ్ర వర్సిటీ ఆచార్యుల తోడ్పాటు



కాలేజీ ఆచార్యులతో ప్రాజెక్టులను రూపొందించిన విద్యార్థినులు



బాడీ ట్రాకింగ్‌కు వినియోగించే పరికరం



సైగలతో నియంత్రణకు వినియోగించే పరికరం

విశాఖ విద్య: ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే ఎలాంటి అసాధ్యాలనైనా సుసాధ్యం చేయవచ్చునని నిరూపిస్తున్నారు ఆంధ్రా యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజినీరింగ్ విభాగం విద్యార్థినులు. సరికొత్త ఆలోచనలతో నూతన ఆవిష్కరణలవైపు దూసుకెళుతున్నారు. తమ మేథస్సుకు పదునుపెట్టి, సమాజానికి ఉపయోగకరమైన ప్రాజెక్టులను రూపొందిస్తున్నారు.

ఇవీ ప్రాజెక్టులు..

యూనివర్సిటీ మహిళా ఇంజినీరింగ్ కాలేజ్ (ఏయూసీఈడబ్ల్యూ) కంప్యూటర్ సైన్స్ విభాగానికి చెందిన నాలుగో సంవత్సరం విద్యార్థులు 'ఇంటెలిజెచర్స్...సోల్‌సెన్స్' అనే రెండు కొత్త ప్రాజెక్టులను రూపొందించారు. ఏయూసీఈడబ్ల్యూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.పద్మశ్రీ ప్రోత్సాహంతో విభాగాధిపతులు డాక్టర్ బి.ప్రజ్ఞ, డాక్టర్ బి.ఎస్తేర్ సునంద మార్గదర్శకత్వంలో ఈ ప్రాజెక్టులను రూపొందించారు.

ఇంటెలిజెచర్స్ అంటే...

సులభమైన చేతి సంజ్ఞలతో బల్బులు, ఫ్యాన్లు వంటి విద్యుత్ పరికరాలను నియంత్రించగల గృహ ఆటోమేషన్ వ్యవస్థ. దీనికి వాయిస్ కమాండ్‌లు, స్విచ్‌ల అవసరం ఉండదు. మీడియా పైప్ ద్వారా సంజ్ఞలను గుర్తించి, ఆర్డుయినో, రిలే బోర్డు ద్వారా పరికరాలను నియంత్రిస్తుంది.

ఎవరికి ఉపయోగం?

ఈ వ్యవస్థ వల్ల ముఖ్యంగా వృద్ధులకు, కదలికల్లో ఇబ్బందులున్న వారికి ఉపయోగం. ఈ ప్రాజెక్టును ప్రదీప్తి, నవ్య, కృపారాణి, చందన కేవలం రూ.3వేల లోపే పూర్తి చేశారు.

సోల్ సెన్స్ అంటే..

ఇది ఒక స్మార్ట్ షూ ఇన్సోల్. ఒత్తిడి, ఈసీజీ ఉష్ణోగ్రత, కదలిక, జీపీఎస్ సెన్సర్ల ద్వారా ఆరోగ్య సమాచారాన్ని సేకరిస్తుంది. ఆరోగ్యాన్ని ట్రాక్ చేయడం, సమస్యలు గుర్తించడం, అవసరమైనప్పుడు సంరక్షకులను అలర్ట్ చేస్తుంది.

ఎవరికి ఉపయోగం?

ఈ వ్యవస్థ క్రీడాకారులకు, వృద్ధులకు అనువైనది. ఈ స్మార్ట్ షూ ఇన్సోల్‌ను షైని ధరావత్, ఉషశ్రీ, జయప్రియ, జెహెరా కేవలం రూ. 6వేల ఖర్చుతో రూపొందించారు.

నైపుణ్యం వెలికితీసేలా ప్రోత్సాహం

ఇంజినీరింగ్ కోర్సులు ఎంచుకున్న వారు సరికొత్తగా ఆలోచించాలి. ఏదో చదివేశాం.. పట్టా తెచ్చేసుకున్నాం అంటే కుదరదు. నేటి పోటీ ప్రపంచంలో అవకాశాలు అందిపుచ్చుకోవాలంటే, నైపుణ్యం ఉన్న విద్య నేర్చుకోవాలి. మా కాలేజీ విద్యార్థినులకు ఇదే చెబుతున్నాం. నైపుణ్యం ఉన్న వారిని ప్రోత్సహిస్తున్నాం.

– ఆచార్య ఆర్.పద్మశ్రీ, ప్రిన్సిపాల్, ఏయూ మహిళా ఇంజనీరింగ్ కాలేజీ

బంగారం విక్రయం పేరుతో మోసం

ఎంవీపీకాలనీ: బంగారం విక్రయం పేరుతో మోసానికి పాల్పడిన ర్యాపిడో డ్రైవర్ మాదిగ బాలుపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివి.. కేఆర్‌ఎంకాలనీ రామాలయం వీధికి చెందిన కోయిలాడ ప్రసాద్‌రావు తన భార్య ప్రసవం సందర్భంగా రాజమండ్రి వెళ్లాడు. అక్కడే మూడు రోజులు బస చేసిన అతనికి ప్రయాణ సమయంలో బాలు పరిచయమయ్యాడు. మార్చి 15న ప్రసాద్‌రావు తిరిగి విశాఖ వచ్చేయగా బాలు అతనికి ఫోన్ చేశాడు. తన వద్ద కొంత బంగారం ఉందని, దాన్ని తక్కువ ధరకు విక్రయించాలని భావిస్తున్నానని చెప్పారు. బంగారం కొనుగోలు చేయాలని కోరడంతో అతని మాటలు నమ్మిన ప్రసాద్‌రావు అందుకు అంగీకరించి విశాఖ తీసుకురావాలని సూచించాడు. దీంతో బాలు కొంత బంగారం విశాఖ తీసుకొచ్చి చూపించగా దాన్ని పరీక్షించిన అనంతరం రూ.12 లక్షలకు కొనుగోలు చేసేందుకు ప్రసాద్‌రావు అంగీకరించాడు. రూ.50 వేలు అడ్వాన్స్‌గా కూడా చెల్లించాడు. డబ్బులు సిద్ధం చేసుకున్నాక ప్రసాద్‌రావు.. బాలుకు ఫోన్ చేశాడు. తనకు ఆరోగ్యం బాగాలేదని చెప్పిన బాలు.. కర్నూల్‌లో బంగారం ఉందని చెప్పి అక్కడకు రావాలని కోరాడు. దీంతో ప్రసాద్ కుటుంబ సభ్యులతో అక్కడికి వెళ్లగా.. కర్నూల్ బైపాస్ రోడ్డులోని ఓ వంతెన దగ్గర గుర్తు తెలియని మరో వ్యక్తితో వచ్చి బాలు వారిని కలిశాడు. అనంతరం ప్రసాద్‌రావు వారు తెచ్చిన బంగారాన్ని తనిఖీ చేస్తుండగా.. బాలు అతన్ని నెట్టేసి డబ్బుతో అక్కడి నుంచి పారిపోయాడు. చుట్టుపక్కల ప్రాంతాల్లో అతన్ని వెతగ్గా కనిపించలేదు. ఈ ఘటనపై ప్రసాద్‌రావు సోమవారం ఎంవీపీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మంగళవారం ఎఫ్ఐఆర్ నమోదు చేసి.. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫైనల్ సెటిల్‌మెంట్ కోసం వీఆర్ఎస్ ఉద్యోగుల నిరీక్షణ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ నుంచి స్వచ్ఛంద పదవీ విరమణ(వీఆర్ఎస్) పొందిన ఉద్యోగులు ఫైనల్ సెటిల్‌మెంట్ కోసం ఎదురుచూస్తున్నారు. వీఆర్ఎస్ ప్యాకేజీ పదవీ విరమణ రోజే అందుకున్న ఉద్యోగులకు, మిగతా వాటి కోసం ఎదురు చూపులు తప్పట్లేదు. స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ప్రకటించిన వీఆర్ఎస్‌కు స్పందించి 1,126 మంది మార్చి నెలాఖరున పదవీ విరమణ చేయగా, 60 ఏళ్లు నిండిన 89 మంది రెగ్యులర్ రిటైర్‌మెంట్ తీసుకున్నారు. యాజమాన్యం సర్క్యులర్‌లో చెప్పిన మాట ప్రకారం వీఆర్ఎస్ ప్యాకేజీను చివరి రోజు రాత్రి వారి అకౌంట్లకు పంపేశారు. అదే మాదిరి ప్రతీ నెలా రెగ్యులర్ రిటైర్‌మెంట్ పొందే ఉద్యోగులకు ఇచ్చేలా గ్రాట్యుటీ 7వ తేదీలోగా, పీఎఫ్ 20వ తేదీ నాటికి అందుతుందని భావించారు. అయితే ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే గ్రాట్యుటీ కోసం ఎదురు చూడక తప్పదని తెలుస్తోంది. పీఎఫ్ అయితే మరింత జాప్యం జరిగే అవకాశం ఉంది. యాజమాన్యం పీఎఫ్ ట్రస్ట్‌కు ఇటీవల ఇచ్చిన రూ.380 కోట్లు ఉద్యోగుల హయ్యర్ పెన్షన్‌కు మాత్రమే సరిపోయేలా ఉంది. దీంతో వీఆర్ఎస్ ఉద్యోగులకు పీఎఫ్ చెల్లింపుల ఇప్పట్లో జరిగేలా కనిపించట్లేదు. ఇక లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ కోసం మరింత ఎదురు చూపులు తప్పేలా లేవని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. యాజమాన్యం స్పందించి ఇంతకు ముందు రెగ్యులర్ రిటైర్‌మెంట్ల వలే వీఆర్ఎస్ ఉద్యోగులకు సత్వరంగా సెటిల్‌మెంట్ చేయాలని కోరుతున్నారు.

బాలుడి మృతిపై సమగ్ర విచారణ



నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

సీతమ్మధార: విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌లో బాలుడి మృతిపై సమగ్ర విచారణ జరుగుతోందని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. పోర్ట్ స్టేడియంలోని విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్ వాటర్ వరల్డ్‌లో సోమవారం రాత్రి రిషి అనే బాలుడు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సీపీ మంగళవారం సంఘటన స్థలాన్ని పరిశీలించి మీడియాతో మాట్లాడారు. బాలుడి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ప్రాథమికంగా ఇది ప్రమాదవశాత్తు జరిగినట్లుగా భావిస్తున్నప్పటికీ, ఈ ఘటనపై సమగ్ర విచారణ చేస్తున్నట్లు కమిషనర్ వెల్లడించారు. స్పోర్ట్స్ క్లబ్ నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్వహిస్తున్నట్లు గుర్తించామన్నారు. రిషి బంధువులను ఉత్తర ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు పరామర్శించారు. అనంతరం స్పోర్ట్స్ క్లబ్‌ను సందర్శించారు. స్విమ్మింగ్‌పూల్‌లో దిగి లోతును పరిశీలించారు. ఈ ఘటనపై పోర్ట్ చైర్మన్, కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. కలెక్టర్ వెంటనే స్పందించి విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్‌ను మూసివేయాలని కోరారు.

ఈకోర్సా అంతర విభాగాల క్రీడా మేళా ప్రారంభం



బెలూన్లు గాల్లోకి వదిలి క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న డీఆర్ఎం

విశాఖ స్పోర్ట్స్: వాల్తేర్ డివిజన్ అంతర విభాగాల క్రీడా మేళాను రైల్వే క్రికెట్ స్టేడియంలో డీఆర్ఎం లలిత్ బోహ్రా మంగళవారం క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ధ్యాన్‌చంద్ అవార్డీ ఎస్.ఉషతో సహా అంతర్జాతీయ క్రీడాకారులు జ్యోతిని వెలిగించి డీఆర్ఎంకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తిపరమైన పనితో పాటు క్రీడాస్ఫూర్తి మేళవింపుగా ఉత్సాహాన్ని నింపేందుకే నెల రోజుల పాటు ఈ క్రీడామేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీఆర్ఎం సతీమణి లలిత్‌బోహ్రా, ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్, ఇ.శాంతారామ్, క్రీడాధికారి ప్రవీణ్‌బాటి, సంయుక్త క్రీడాధికారి అవినాష్, బ్రాంచ్ అధికారులు, కార్యనిర్వాహక సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వాల్తేర్ తూర్పు కోస్తా రైల్వే స్పోర్ట్స్ సంఘం(ఈకోర్సా) ఆధ్వర్యంలో 13 విభాగాల ఉద్యోగుల జట్లు మెన్, వుమెన్ కేటగిరీల్లో పోటీపడనున్నాయి. ఆర్పీఎఫ్–కమర్షియల్ విభాగాల మధ్య క్రికెట్ మ్యాచ్‌ను డీఆర్ఎం టాస్ వేసి ప్రారంభించారు. ఈ మ్యాచ్‌లో కమర్షియల్ జట్టు 50 పరుగుల తేడాతో విజయం సాధించగా, మరో మ్యాచ్‌లో ఎలక్ట్రికల్ ఈఎల్ఎస్ జట్టు ఆరు వికెట్ల తేడాతో ఎలక్ట్రికల్ ఆపరేషన్స్ జట్టుపై గెలుపొందింది. మహిళల క్యారమ్స్ పోటీల్లో ఈఎల్ఎస్, ఈఎల్ఈ(జనరల్) జట్లు ఎ–పూల్‌లోనూ, డీఎల్ఎస్, స్టోర్స్, అకౌంట్స్, ఆపరేషన్స్ జట్లు బి–పూల్‌లోనూ తొలిరోజు పోటీల్లో విజయం సాధించాయి.

'కృష్ణ'ను కుంకీ శిక్షణకు పంపించండి

- జూ క్యూరేటర్‌కు పీసీసీఎఫ్ ఆదేశం
- అదనపు పీసీసీఎఫ్‌లతో జూ పరిశీలన



జిరాఫీల ఎన్‌క్లోజర్ వద్ద ఫొటో దిగిన పీసీసీఎఫ్ ఎ.కె నాయక్, అడిషనల్ పీసీసీఎఫ్

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో కృష్ణ అనే మగ ఏనుగును కుంకీ శిక్షణకు పంపించేందుకు చర్యలు చేపట్టాలని జూ క్యూరేటర్ జి.మంగమ్మను ఏపీ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(పీసీసీఎఫ్) అజయ్ కుమార్ నాయక్ ఆదేశించారు. జూ పార్కులో కృష్ణ కొన్ని దశాబ్దాలుగా సందర్శకులకు దూరంగా ఉంటున్న విషయం తెలిసిందే. డిప్యూటీ సీఎం కె.పవన్ కల్యాణ్ జూ పర్యటన నేపథ్యంలో అదనపు పీసీసీఎఫ్‌లు శాంతిప్రియ పాండే, రాహుల్ పాండేలతో కలసి మంగళవారం ఇక్కడకు చేరుకున్నారు. అయితే పవన్ కల్యాణ్ పర్యటన రద్దవడంతో, ఆయన జూ పార్కు ఎదురుగా ఉన్న ఎకో టూరిజం పార్కు కంబాలకొండను సందర్శించారు. అలాగే జూలో వన్యప్రాణులు, వాటి ఎన్‌క్లోజర్లు, ఆస్పత్రి, అభివృద్ధి పనులు, సిద్ధమైన పలు ఎన్‌క్లోజర్లు, సందర్శకులకు కల్పిస్తున్న సౌకర్యాలు పరిశీలించారు. వన్యప్రాణులకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు గురించి ఆరా తీశారు. జూలో అడవి కుక్కల పునరుత్పత్తి కేంద్రం అభివృద్ధిని పరిశీలించి జూ అధికారులను అభినందించారు. వన్యప్రాణుల ఎన్‌క్లోజర్ల వద్ద ఫొటోలు దిగారు. కంబాలకొండలో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించి, వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం జూ లవర్స్ డే పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ నాయక్ మాట్లాడుతూ వన్యప్రాణులకు అందించే వైద్య సేవలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. కృష్ణను ఏనుగుల క్యాంప్‌లో కుంకీ శిక్షణకు పంపించే ఏర్పాట్లు చేయాలన్నారు. అడవుల నుంచి జనావాసాలు, పొలాల్లోకి చొరబడి పంటలు నాశనం చేస్తున్న ఏనుగుల గుంపులను తిరిగి అడవుల్లో తరలించే విధంగా దీనికి శిక్షణ ఇస్తారన్నారు. విశాఖ సీఎఫ్ బి.ఎం.మైదీన్, పలువురు డీఎఫ్‌వోలు పాల్గొన్నారు.

గంటా ఇంటి ముందు జీవీఎంసీ కార్మికుల నిరసన

గంటన్నర పడిగాపులు కాసినా.. పట్టించుకోని భీమిలి ఎమ్మెల్యే



నిరసనకు దిగిన కార్మిక నాయకులతో మాట్లాడుతున్న సీఐ మురళి

ఎంవీపీ కాలనీ: మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ స్థానికంగా నివాసం ఉంటున్న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇంటి ఎదుట సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో కార్మికులు నిరసన చేపట్టారు. ఎమ్మెల్యే గంటాకు ఈ అంశంపై వినతిపత్రం ఇచ్చేందుకు ఎంవీపీ కాలనీ సెక్టార్–4లోని ఆయన ఇంటికి మంగళవారం వెళ్లారు. ఆయన ఇంట్లోనే ఉన్నప్పటికీ వినతిపత్రం స్వీకరించేందుకు బయటకు రాలేదు. గంటన్నర పాటు నిరీక్షించినా.. స్పందించకపోవడంతో ఆగ్రహానికి గురైన కార్మికులు గంటాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన తీవ్రం చేశారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం గంటా పీఏలు అక్కడికి వచ్చి వినతిపత్రం తమకు ఇవ్వాలని కోరినా కార్మికులు అంగీకరించలేదు. ఓ ప్రజాప్రతినిధి అయివుండీ కార్మికుల సమస్యలు వినడానికి ముందుకు రాకపోవడం దురదృష్టకరమని ఆక్షేపించారు. అంతకు ముందు వారంతా ఎమ్మెల్యే వెలగపూడికి వినతిపత్రం అందించి, సమస్యలను వివరించారు. సీఐటీయూ ఆర్గనైజింగ్ సెక్రటరీ వి.కృష్ణారావు, సహాయ కార్యదర్శి జీఆర్ నాయుడు, మున్సిపల్ యూనియన్ నాయకులు ఆర్.శ్రీను, కె.కుమారి, ఇ.ఆదినారాయణ, శేషుబాబు, కొండమ్మ, శ్రీదేవి, విజయ, చెల్లయ్యమ్మ, రాజు, గోపి, వెంకట్రావు పాల్గొన్నారు.

112 కిలోల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి

కూర్మన్నపాలెం: అగనంపూడి టోల్‌గేటు వద్ద సోమవారం రాత్రి దువ్వాడ పోలీసుల తనిఖీల్లో 112 కిలోల గంజాయి పట్టుబడింది. ఈ కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను వెల్లడించారు. మాడుగుల ప్రాంతం నుంచి బెంగళూరుకు తరలించడానికి ఆటోలో గంజాయి తీసుకొస్తుండగా.. ముందస్తు సమాచారం మేరకు అగనంపూడి టోల్‌గేటు వద్ద తనిఖీలు చేపట్టారు. ఈ కేసులో కిముడు అనుమాన్, బురరిపాల్ దినకర్, ఒక బాలికను అరెస్ట్ చేశారు. ఆటో, బైక్, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కాగా.. మాడుగులలో అఖిల్ అనే వ్యక్తి వద్ద ఈ గంజాయిని కొనుగోలు చేశారు. 100 ప్యాకెట్లుగా తయారు చేసి బెంగళూరుకు తరలించడానికి విశాఖ తీసుకొస్తున్నారు. ఒక వ్యక్తి బైక్‌పై పైలట్‌గా వస్తుండగా, వెనుక ఆటోలో గంజాయిని తీసుకువస్తున్న వారిని వలపన్ని పట్టుకున్నట్లు ఏసీపీ తెలిపారు. అఖిల్ కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఒకరి వెంట మరొకరు

- ప్రియుడు చనిపోయిన 24 గంటల్లోనే ప్రియురాలు ఆత్మహత్య



ప్రశాంత్, సుజాత(ఫైల్)

దాబాగార్డెన్స్: ప్రేమ ఎంత బలమైనదో.. కొన్నిసార్లు అంతే విషాదకరమైన ముగింపునిస్తుంది. అందుకు నిదర్శనమే ఈ ఘటన. ఆరిలోవకు చెందిన ప్రశాంత్ కుమార్ (23), శ్రీకాకుళానికి చెందిన గేదెల సుజాత (27) ప్రేమించుకున్నారు. కేజీహెచ్‌లో ఎమర్జెన్సీ ఆపరేషన్ థియేటర్‌లో అసిస్టెంట్‌గా పని చేస్తున్న ప్రశాంత్ శనివారం రాత్రి డ్యూటీకి వెళ్లాడు. ఆదివారం ఉదయం అతను విగతజీవుడై కనిపించాడు. మృతదేహం పక్కనే రెండు సిరంజీలు ఉండటం అనుమానాలకు తావిచ్చింది. అయితే అతని మరణానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది. ప్రశాంత్ మరణ వార్త సుజాతను తీవ్రంగా కలచివేసింది. గోపాలపట్నంలో తన సోదరుడితో కలిసి ఉంటున్న సుజాత, తన ప్రియుడు ఇక లేడన్న విషయాన్ని తట్టుకోలేకపోయింది. అతని మరణించిన 24 గంటల్లోపే సోమవారం ఉదయం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆదివారం ప్రశాంత్ మరణించగా, సోమవారం ఉదయం అతని పోస్టుమార్టం జరిగింది. అదే సమయంలో సుజాత తన ప్రాణా లు తీసుకుంది. మంగళవారం ఉదయం సుజాత మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. సుజాత గతంలో కేజీహెచ్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేసిన సమయంలోనే చిగురించిన ప్రేమ.. చివరకు విషాదంగా మిగిలింది. ఈ ఘటనలపై కేసులు నమోదు చేసిన పోలీసులు.. ప్రేమ విఫలమైందా? కుటుంబ సభ్యులు అంగీకరించలేదా, లేక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.